క్లుప్తంగా

కొనుగోలు కేంద్రంపై చర్యలు తీసుకోండి



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రం నిర్వహణ సరిగా లేదని అధికారుల పర్యవేక్షణ కొరవడిందని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పంటను కోసిన రైతులకు తేమ పేరుతో ఇబ్బందులు గురిచేస్తున్నారని తెలిపారు. రైతులకు నిర్వాహకులు లోపాయికారి ఒప్పం దాలతో సంచులు ఇచ్చి తూకాలు చేస్తున్నారని, గతంలో కొనుగోలు కేంద్రం నిర్వహణ రూ.లక్షలు అవినీతి అయ్యిందని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో భూమిరెడ్డి, కృష్ణ వర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కొత్తకోట: ఆరోగ్య క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని సోమవారం పట్టణంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. టోర్నీలో మొత్తం 70 టీంలు పాల్గొంటున్నాయని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50వేలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, కొండారెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

రేపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

పాన్‌గల్: మైనార్టీ, దివ్యాంగుల కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి 26న మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పాన్‌గల్: సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నాగన్న తెలిపారు. సోమవారం మండలంలోని అన్నారంలో సైబర్ నేరాలు, బాల్య వివాహాల నిరోధం, ఆడ పిల్లల చదువు, బాలల సంరక్షణ కమిటీలపై వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో అధార్, బ్యాంక్ ఖాతాల వివరాలను చెప్పకూడదన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలని, చిన్న వయస్సులో వివాహాలు చేయకూడదన్నారు. కుటుంబంలో మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. బాలల హక్కులకు భంగం కలిగించకుండా తోడ్పాటునందించాలన్నారు. సమావేశంలో సర్పంచ్ రాములు, కార్యదర్శి ఆంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


కొండచిలువ కలకలం

గోపాల్‌పేట: మండలంలోని చాకల్‌పల్లి సమీపంలోని ఎర్రగట్టుతండా ప్రాంత అడవుల్లో కొండచిలువ సంచారం కలకలం రేపుతుంది. కొంత కాలంగా ఈ అడవుల్లో కొండ చిలువ సంచరిస్తుందని స్థానికులు చెబుతున్నారు. రైతులు, గొర్రెల కాపర్లు, ప్రజలు అడవిలోకి వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు చెబుతున్నారు.

నేటి నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర

వనపర్తిటౌన్: పురపాలికలో మంగళవారం నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడు పాదయాత్ర చేపట్టనున్నట్లు పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, ఓబీసీ టౌన్ అధ్యక్షుడు మన్నెంకొండ సోమవారం విలేకరులకు తెలిపారు. మొదటి రోజు మర్రికుంటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్ర చేపట్టనున్నట్లు చెప్పారు. 12 రోజుల పాటు 33 వార్డుల్లో తిరగనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్ర రోజుల్లో మాజీ మంత్రి చిన్నారెడ్డి పాల్గొని ప్రతి ఇంటికి కాంగ్రెస్ లక్ష్యాలను, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతారని తెలిపారు.

ప్లాస్టిక్ గ్లాస్‌లు అమ్మితే చర్యలు



అమరచింత: పట్టణంలోని వర్తకులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఆటోలో వచ్చి ఎవరైన ప్లాస్టిక్ గ్లాస్లు, కవర్లు అమ్మితే జరిమానాతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు. సోమవారం ఆత్మకూర్ పట్టణంలో ఇతర ప్రాంతాల నుంచి ప్లాస్టిక్ గ్లాస్ల లోడ్‌తో వచ్చిన ఆటోను పట్టుకోని రూ.3వేల జరిమానా విధించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడటం నిషేధమన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి



అధికారికి సూచనలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

గోపాల్‌పేట: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం రేవల్లి మండల కేంద్రంలో ఎంపీపీ సేనాపతి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మిషన్ భగీరథ పనులు పురోగతిపై ఏఈ మొగులయ్య సభకు పలు విషయాలు వివరించారు. కొన్ని గ్రామాల్లో మంచినీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని సభ్యులు చెప్పగా, మరోసారి తలెత్తకుండా చూడాలని చెప్పారు. దాదాపుగా అన్ని గ్రామాలకు ప్రతిరోజు మిషన్ భగీరథ నీరు అందుతుందని తెలిపారు. రేవల్లి మండలంలో మూడునెలల్లో ప్రజలకు అందించిన సేవలను మెడికల్ ఆఫీసర్ మంజుల వివరించారు. పశువైద్యశాఖ తరపున ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం మండలంలోని లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నామని, రైతులు దళారులను నమ్మకుండా ఉండేందుకు ప్రజాప్రతినిధులు సైతం తెలియని వారికి అండగా ఉండాలని కోరారు. ట్రాన్స్‌కో ఏఈ నర్సింహులు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ట్రాన్స్‌ఫార్మర్లు, సామగ్రి అందిస్తున్నామనిచ ఎక్కడైనా స్తంభాలు లేకుంటే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. లోఓల్టేజీ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కస్తామని చెప్పారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. ఎటువంటి సమస్యలు ఉన్నా మొదట ప్రజల నుంచి విషయం తెలుసుకుని తమ శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సేనాపతి, జెడ్పీటీసీ భీమయ్య, ఎంపీడీఓ సుజాత, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కార్యదర్శులను గుర్తించాలి



పోస్టుబాక్స్‌లో కార్డులు వేస్తున్న కార్యదర్శులు

వీపనగండ్ల: మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు తమను రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రకటించాలని కోరుతూ సోమవారం పోస్టుకార్డుల్లో సీఎంకు పంపించారు. తమను ఉద్యోగంలోకి తీసుకున్నప్పుడు 3ఏళ్ల పనిచేయాలని ప్రకటించి ఆ తర్వాత మరో ఏడాది పెంచారన్నారు. 4 ఏళ్ల గ్రామాల అభివృద్ధిలో ఎన్నో పనులను విజయవంతంగా నిర్వహించామని ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో నరేష్‌గౌడ్, రాజశేఖర్, కుర్మయ్య, బాలశేషు, శ్యాం పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: పంచాయతీరాజ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని సోమవారం మండల పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందేలా పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టారు. వారు పోస్టుకార్డులు రాసి నిరసన తెలిపారు. నిరవధిక సమ్మెకు అనుమతులు కోరుతూ ఎస్‌ఐ శ్రీహరికి వినతి పత్రం ఇచ్చారు.

ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

వనపర్తిటౌన్: మున్సిపాలిటీలోని 6వ వార్డులో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు సోమవారం ఖాళీ బిందెలతో మున్సిపాలిటీ ఎదుట నిరసనకు దిగారు. వారానికొకసారి నీళ్లు వస్తుండటంతో తాగేందుకు, అవసరాలకు సరిపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కౌన్సిలర్, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకొచ్చిన స్పందించడం లేదని వాపోయారు. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులతో నెట్టుకొస్తున్నామని, పరిస్థితులు ఇలా ఉంటే ముస్ముందు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

సూగూర్‌ను మండల కేంద్రం చేయాలి



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పెబ్బేరు: మండలంలోని సూగూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని సోమవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. గతంలో ఈ గ్రామం వనపర్తి సంసస్థానంగా ఉందని, మండలంలోని పెద్ద పంచాయతీతో పాటు మండల కేంద్రానికి అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, రైతులు, యువకులు కోరారు. కార్యక్రమంలో వెంకటస్వామి, జూదం వెంకటేష్, సీతార వెంకటేశ్వర్లు, బుచ్చన్న, ఆంజనేయులు, కురుమూర్తి, నరసింహనాయుడు, పరశరాముడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లి గ్రామంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం సర్పంచ్ దొడ్ల లక్ష్మీ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాలల సమస్యల పరిష్కారం కోసం పాటు పడాలని కోరారు. శ్రామిక వికాస కేంద్రం మండల కోఆర్డినేటర్ మహేష్ మాట్లాడుతూ పిల్లలకి వేసవి సెలవులు ఇవ్వడంతో తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, రాధా తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించండి



గోపాల్‌పేటలో కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

గోపాల్‌పేట: ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అన్ని ధరలు పెరిగాయని, కానీ కూలి ఏడు శాతం పెంచడం అన్యాయం అన్నారు. నీడ కోసం టెంట్లు, తాగునీరు లేవన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, పనిముట్లు ఇవ్వాలన్నారు. ఆయన వెంట మహేష్, బుచ్చన్న, నాగన్న తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో ఉపాధి పనులను సోమవారం సర్పంచ్ శాంతమ్మతో కలిసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ పరిశీలించారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలు వేసవి కాలం నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొజ్జమ్మ, కార్యదర్శి నర్మద, ఫీల్డ్ అసిస్టెంట్ సోమ్లానాయక్, కూలీలు పాల్గొన్నారు.

జెండా పండుగ ఘనంగా నిర్వహించాలి

పాన్‌గల్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం పల్లె, పల్లెన గులాబీ జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాముయాదవ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యానాయుడు నాయకులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో జెండా పండుగను ప్రతి పల్లెలో నిర్వహించాలన్నారు. కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్‌ఎం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించే నియోజకవర్గ పార్టీ సమావేశానికి హాజరు కావాలన్నారు. సమావేశంలో శాంతయ్య, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులను అందిస్తున్న సేవా సమితి సభ్యులు

అమరచింత: మండలంలోని జూరాలలో ఎంపీహెచ్ ఎస్ పాఠశాలలో వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, ఆట పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతులను అందించారు. స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటపోటీలను నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, ఎస్‌ఎంసీ చైర్మన్ బాలరాజ్, బాలు, నారాయణ, వర్షిణి, స్వాతి, జయశ్రీ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని డఫోడీల్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యతో పాటు ఆట పాటలు, క్రీడల్లో రాణించినప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎం రాముడు అన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

పెబ్బేరు: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్‌ఐ జగదీశ్వర్ సూచించారు. సోమవారం జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బైక్ నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం హెల్మెట్ లేకుండా బైక్ నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారికి కొత్త హెల్మెట్‌లను అందించారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు అందిస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న వివిధ గ్రామాల నుంచి కాలినడకన వచ్చే విద్యార్థులు 65 మందికి మంత్రి సొంత ఖర్చుతో సైకిళ్లు అందించారు. వాటిని సోమవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ బాలీశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఎంఈఓ ఉషారాణి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు సైకిళ్లను సద్వినియోగం చేసుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలన్నారు.

టీపీఓగా వరప్రసాద్



వనపర్తిటౌన్: స్థానిక మున్సిపాలిటీకి ఎట్టకేలకు టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ) నియమితులయ్యారు. సోమవారం వరప్రసాద్ అధికారిక బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. అక్రమ లే అవుట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలకు ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ అవకాశం కల్పించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీని ద్వారా భవన నిర్మాణ అనుమతులకు మార్గం మరింత సుగమం అవుతుందన్నారు. వారం రోజుల క్రితం నుంచి ప్రారంభమైన ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి ప్రభుత్వం నిర్దేశిత గడువు విధించలేదని తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగం తరపున 2019 కొత్త పురపాల చట్టానికి అనుగుణంగా నిబంధనలను ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

వనపర్తిటౌన్: సీపీఆర్ విధానంపై విద్యార్థులకు అవగాహన ఉంటే ప్రత్యామ్నాయ సమయంలో ప్రాణాలు కాపాడవచ్చని రాష్ట్ర కో–ఆర్డినేటర్ రమణ అన్నారు. సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్కాలర్స్ డిగ్రీ కళాశాలలో సీపీఆర్ ప్రథమ చికిత్స, లో, హై బీపీ, లో, హై షుగర్ తదితర ప్రథమ చికిత్సలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటుతో చనిపోతున్నారని, అలాంటి సమయంలో సీపీఆర్ ప్రథమ చికిత్సతో ప్రాణాలను నిలబెట్టవచ్చన్నారు. రాజేందర్, ప్రిన్సిపాల్ సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదు



అప్పరాల–తిప్పడం పల్లి వంతెన పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట: రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించి, ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న బీఆర్‌ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో తిరుగులేదని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని అప్పరాలలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అప్పరాల–తిప్పడంపల్లి మధ్య ఊకచెట్టు వాగుపై రూ.5.10 కోట్లలో కొనసాగుతున్న వంతెన పనులను పరిశీలించారు. అదేవిధంగా అప్పరాలలో పంచాయతీ భవనం, ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం, వాల్మీకి భవనం వద్ద కంపౌండ్ వాల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అప్పరాలలో పామాపురం సింగిల్ విండో, ఐకేపీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చిన అధిక శాతం బీఆర్‌ఎస్ స్థానాలు దక్కించుకోవడం ఖాయమన్నారు. ప్రతి కుటుంబంలో బీఆర్‌ఎస్ నుంచి ఏదో ఒక రకంగా లబ్ధి పొందిన వారే ఉన్నారని గుర్తు చేశారు. అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు పార్టీలో ఏనాటికైనా గుర్తింపుతో పాటు, ప్రతిఫలం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హిమబిందు, కృష్ణయ్య, శంకర్, అల్లాభాష, వడ్డే శ్రీనివాసులు, బాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

పెబ్బేరు: మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీకంటి నిరంజనయ్యకు దళిత అవార్డు రావడంతో సోమవారం ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటరమణ, షఫీ, రాజేశ్వరి, శాంతబాయ్, సాయిరేణు, శ్రీదేవి, మద్దమ్మ పాల్గొన్నారు.

మంత్రి ఆస్తులపై విచారణ చేయండి



కొత్తకోటలో మాట్లాడుతున్న ఎగ్గని నర్సింహులు

కొత్తకోట: భూ కబ్జాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డినిరంజన్‌రెడ్డి ఆస్తులపై విచారించాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎగ్గని నర్సింహులు డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మంత్రికి వ్యతిరేకంగా చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలో ఉన్న మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని, కృష్ణానది వద్ద మట్టిపోసి ప్రహరీ నిర్మించుకున్న విషయం కళ్లకు కనిస్తున్నా, సీఎం కేసీఆర్ స్పందించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో భరత్ భూషన్, కోటీశ్వర్‌రెడ్డి, సాయిరాం, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాఘువేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వనపర్తి క్రైం: అవినీతి, ఆక్రమణకు మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణపై విచారణ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద నాయకులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, రామ్మోహన్, సర్పంచ్ దేవేందర్, సుమిత్రమ్మ, సీతారాములు, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్, బచ్చురాం, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

గోపాల్‌పేట: వనపర్తి జిల్లాలో భూఆక్రమాలపై సర్వే చేయించి కాపాడాలని బీజేపీ మండల అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. కార్యక్రమంలో తిరుపతినాయక్, వెంకటాచలం, వెంకటేష్, నాగరాజు, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట ధర్నా కార్యక్రమం చేశారు. జిల్లా అధికార ప్రతినిధి సహదేవుడు, ఓబీసీ అధ్యక్షుడు రాఘవేంద్రగౌడ్ మాట్లాడుతూ.. వనపర్తి నియోజకవర్గంలో మంత్రి నిరంజన్‌రెడ్డి భూకబ్జాలు చేసి అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలో 60 ఎకరాల భూమిని కొనుగోలు చేసని మంత్రి 120 ఎకరాలకు పైగా ఎలా వచ్చిందని వీటిపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ అబ్రహం లింకన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

అమరచింత: మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని, విచారించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిది మేర్వరాజు మాట్లాడారు.

ఈటలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

పెబ్బేరు రూరల్: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నాయకులు సోమవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రేవంత్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేయడమే బీజేపీ నాయకుల పని అని మండిపడ్డారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశన్న, గోవిందు, విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్నాగౌడు, ఎల్లస్వామి, బలరాంనాయక్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

'బసవ' పురస్కారం ప్రదానం

వనపర్తి క్రైం: బసవ జయంతిని పురస్కరించుకుని పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు భైరోజు చంద్రశేఖర్‌కు నారాయణపేట జిల్లా మాగనూర్ మండలం నేరగడంలో శ్రీ పశి మాద్రి సంస్థానం విరక్త మఠం వారు బసవ పురస్కారాన్ని ప్రదానం చేశారు. వృత్తిరీత్యా తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మూడు దశాబ్దాలుగా ఆయన కళలకు, చేస్తున్న సేవలకు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. సాహితీకళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, నారాయణరెడ్డి, రాములు, శ్రీనివాసులు, చెన్నపద్మ హర్షం వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించండి



గోవర్ధనగిరిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వీపనగండ్ల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఎంపీపీ కమలేశ్వర్‌రావు, కొప్పునూరు సింగిల్ విండో అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం గోవర్ధనగిరి, బొల్లారం, కొర్లకుంటలో వారు మండల మహిళా సమాఖ్య ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలలో అన్ని రకాల వసతులను ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, సురేష్‌రెడ్డి, వీరయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడమే లక్ష్యం

అమరచింత: రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని, వరిధాన్యం కొనుగోలు చేయడానికే కేంద్రాలను ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేస్తున్నామని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అన్నారు. ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో రైతువేదికల వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని, ప్రతి పంటకు పెట్టుబడి సాయంతో పాటు వరికి గిట్టుబాటు ధరను అందించి రైతుద్వారా నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ వెంకటేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, రేచింతల సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, సులోచనమ్మ, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెబ్బేరు: మండలంలోని ఐకేపీ–సెర్ప్ ఆధ్వర్యంలో గుమ్మడం, గుమ్మడంతండా, తిప్పాయిపల్లి, పాతపల్లి, ఈర్లదిన్నె, రంగాపూర్‌లో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఎంపీపీ శైలజ, సింగల్ విండో అధ్యక్షుడు గౌని కోదండరామిరెడ్డి హాజరై మాట్లడారు. ఏపీఎం తిరుపతిరెడ్డి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న టీవీ మెకానిక్

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఏటీఎంలోని డ్రా అయిన నగదును తీసుకోకపోవడంతో టీవీ మెకానిక్ రవికి వాటిని తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో అందించాడు. మార్చి 26న పట్టణ కేంద్రానికి చెందిన కురుమూర్తి బస్టాండ్ ఎదురుగా ఉన్న ఏటీఎంలో నగదు డ్రా చేశాడు. డబ్బులు బయటకు రాలేకపోవడంతో వెళ్లిపోయాడు. కొంత సేపటికి టీవీ మెకానిక్ రవి కూడా ఏటీఎంకి వెళ్లగా రూ.9 వేలు డ్రా అయి తీసుకోకపోవడంతో వాటిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు విచారణ చేసి బాధితుడు కురుమూర్తికి సోమవారం ఇచ్చారు. ఆయనను పోలీసులు అభినందించారు.